ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

శనివారం 25 జనవరి 2025

నిలదీతలు.. వాగ్వాదాలు



మెట్‌పల్లిలో ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నాయకులు

- జిల్లాలో ముగిసిన గ్రామసభలు
- పలుచోట్ల అర్హుల జాబితాల్లో పేరులేదని ప్రజల ఆందోళన
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

8

ప్రభుత్వ భూమి హాంఫట్

- రికార్డులు మార్చి పట్టాదారుపుస్తకాలు పొందిన అక్రమార్కులు
- మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫిర్యాదుతో వెలుగులోకి

8

పెద్దపులి సంచారంపై పరిశీలన

- నాలుగు బృందాల ఏర్పాటు

7

దరఖాస్తుల వెల్లువ

- గ్రామ, వార్డుసభల్లో నాలుగు పథకాలకు అధిక సంఖ్యలో ఆర్జీలు
- రేషన్ కార్డులో చేర్పులు, మార్పులకు సైతం...
- చివరి రోజూ గ్రామసభల వద్ద జనం బారులు
- అనర్హులను ఎంపిక చేశారంటూ అసంతృప్తి
- కొన్ని చోట్ల మధ్యలోనే సభలకు బ్రేక్
- జిల్లా వ్యాప్తంగా 72,686 దరఖాస్తులు



జగిత్యాలలో వార్డు సభలో దరఖాస్తులు సమర్పిస్తున్న మహిళలు

జగిత్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాలకు గ్రామసభల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. గ్రామసభలో ప్రదర్శించిన జాబితాల్లో అనర్హులకు చోటు కల్పించారని మండిపడ్డారు. నిరసనలు, నిలదీతల నడుమ సభలు కొనసాగగా అర్హులపేర్లు లేకపోతే మరోమారు దర ఖాస్తు చేసుకోవాలన్న సూచనతో ఈ సభలు దర ఖాస్తుల స్వీకరణ సభలుగా మారాయి. ఇలా నాలుగు రోజుల్లో జిల్లాలో నిర్వహించిన సభల్లో నాలుగు పథకా లకు 72,686 దరఖాస్తులు అందడం గమనార్హం. దరఖాస్తుల సంఖ్య పై ఒకటి, రెండు రోజుల్లో మరింత స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

● ఆగ్రహ జ్వాలలు

జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో నాలుగురోజుల పాటు గ్రామ, వార్డు సభలను నిర్వహించారు. దాదాపుగా అన్ని సభల్లోనూ సంక్షేమ పథకాలకు ప్రదర్శించిన జాబితాలపై ప్రజల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జాబితాల్లో అనర్హులు ఉన్నారని, అర్హులకు చోటు కల్పించలేదని అధికారులను నిలదీశారు. కొన్నిచోట్ల నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో అధికారులు సభలను మధ్యలోనే ముగించి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఇక చివరి రోజైన శుక్రవారం కూడా ఇదే పరిస్థితి నెలకొనగా పలుచోట్ల బీఆర్ఎస్ నేతలు గ్రామస్థులకు మద్దతుగా నిరసన తెలిపారు. ప్రస్తుతం ప్రకటించింది తుదిజాబితా కాదని, ఇక్కడ అభ్యంతరాలు స్వీకరించి విచారణ అనంతరం అనర్హులను తొలగిస్తామని అధికారులు నచ్చచెప్పారు.

పథకాల వారీగా అందిన దరఖాస్తులు

పథకం	దరఖాస్తులు
ఇందిరమ్మ ఇళ్లు	19,708
రేషన్ కార్డులు	27,858
రేషన్‌కార్డుల్లో మార్పులు	14,101
రైతు భరోసా	1,077
ఆత్మీయ భరోసా	9,942
మొత్తం	72,686

● పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్..

జిల్లాలో నిర్వహించిన గ్రామ, వార్డు సభలకు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలోని జైనా గ్రామంలో- మిగతా 8లో

● చివరిరోజు గందర గోళంగా..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో నాలుగో రోజు శుక్రవారం నిర్వహించిన గ్రామ, వార్డు సభలు గందర గోళంగా జరిగాయి. జిల్లాలోని మల్లాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ఫ్లెక్సీ వివాదం చోటుచేసుకుంది. గ్రామసభ సందర్భంగా ప్రదర్శించిన ఫ్లెక్సీలో బీఆర్ఎస్‌కు చెందిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఫొటో లేదంటూ ఆ పార్టీ నేతలు నిరసనకు దిగారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం, తోపులాట జరి గింది. జిల్లాలోని మెట్‌పల్లి మున్సిపల్‌లోని 6వ, 21వ వార్డుల్లో, కోరుట్ల నియోజకవర్గం పైడిమడుగులో జరి గిన గ్రామసభలో నిర్వహించిన సభల్లో సైతం బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అదేవిధంగా జిల్లాలోని రాయికల్ మండలం అల్లీపూర్, ద్యావనపల్లి గ్రామాల్లో నిర్వహిం చిన సభల్లో అర్హులకు జాబితాలో చోటు కల్పించలే దని అధికారులను పలువురు మహిళలు నిలదీశారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

మల్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల శ్రద్ధతో చదవుకుంటూ ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలలో ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. గురుకులంలో వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు మల్యాలలో సింగిల్‌విండో నూతన భవనం, రామన్నపేటలో సీసీ రహదారులు, గొల్లపల్లిలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, తహసీల్దార్ మునీందర్, ఎంపీవో ప్రవీన్, సింగిల్‌విండో చైర్మన్ రాంలింగారెడ్డి నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, శనిగారపు తిరుపతి, నేరెళ్ల సతీష్‌రెడ్డి, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, ప్రసాద్, ప్రతాప్, మ్యాక లక్ష్మన్, కట్కం వినయ్, కంచర్ల లక్ష్మణచారి, నరసింహరెడ్డి, సంజీవ్, హరినాథ్, ప్రశాంత్, పృథ్వీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● చెక్కులతో పాటు ఫొటోఫ్రేం అందజేత

మండలంలోని పలు గ్రామాలకు చెందిన 30మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మల్యాలలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చెక్కులు పంపిణీ చేశారు. వధువరుల వివాహ ఫొటోతో రుపొందించిన ఫొటోఫ్రేమ్‌లను మాజీ సర్పంచ్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ తయారు చేయించగా చెక్కులతో పాటు వాటిని లబ్ధిదారులకు అందించారు. అనంతరం 29మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు

యువకులు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి



కీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రసాద్

జగిత్యాల అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జస్టిస్ ప్రసాద్ సూచించారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలోని వివేకానంద మినీ స్టేడియంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రెండు రోజుల పాటు జరగనున్న క్రీడల్లో రెండు వందల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చైల్డ్ మ్యారేజ్ కో-ఆర్డినేటర్ పోలవేణి భూమేష్, మారం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన ఆర్‌యూపీపీటీ నాయకులు



డీఈవోకు స్వీట్ తినిపిస్తున్న ఆర్‌యూపీపీటీ సంఘ బాధ్యులు

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి రామును రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు (ఆర్‌యూపీపీటీ) బాధ్యులు శుక్రవారం ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెండేళ్లుగా రావల్సిన ఎస్సెస్సీ స్పాట్ అమౌంట్‌తో పాటు ఇతర నిధులు వచ్చేలా చూడాలని కోరారు. డీఈవో రాము మాట్లాడుతూ స్పాట్ అమౌంట్ విషయంపై రాష్ట్ర విద్యాశాఖకు రాసి పంపామని, ఈఎల్స్, ఎలక్షన్స్ డ్యూటీ సర్టిఫికెట్ ఆధారంగా సంబంధిత డీడీవోలు జీవో 40ప్రకారం మంజూరు చేయవచ్చన్నారు. అనంతరం డీఈవోను కొండగట్టు ఆంజనేయస్వామి వారి శాలువాతో సత్కరించి, మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో ఆర్‌యూపీపీటీ బాధ్యులు వేల్పుల స్వామి యాదవ్, చంద సత్యనారాయణ, అన్నారంభట్ల సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

భీమారం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపేట, మన్నెగూడెం గ్రామాల్లో ఆయిల్‌పామ్ తోటలను మండల వ్యవసాయాధికారి షాహిద్ అలీ శుక్రవారం సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. రైతులు తోటల్లో ఆయిల్ పామ్‌పూత తొలగించే విధానం గురించి రైతులకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, ఆసక్తిగల రైతులు స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో సురేందర్ నాయక్, మానిటరింగ్ ఆఫీసర్ అన్వేష్, రైతులు శంకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, గంగిరెడ్డి, రాజరెడ్డి, గంగారాం, గణేష్, భూమేష్ పాల్గొన్నారు.

టూరిస్ట్ హబ్‌గా అర్బన్ అటవీపార్కు

● జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



అంబారిపేట అర్బన్ అటవీపార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదం పంచడానికే అర్బన్ అటవీపార్కు ఏర్పాటు చేశామని, టూరిస్ట్ హబ్‌గా అర్బన్ అటవీపార్కు మారుతుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల మండలం అంబారిపేట గ్రామంలో రూ. 2కోట్లతో ఏర్పాటు చేసిన అర్బన్ అటవీపార్కును కలెక్టర్ సత్యప్రసాద్, బాసర సర్కిల్ సీసీఎఫ్ శర్వానంద్‌తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్బన్ అటవీపార్కుతో ప్రజలకు ఆహ్లాదమైన వాతావరణం లభిస్తుందన్నారు. నేటి ఒత్తిడితో కూడిన జీవనవిధానంలో పార్కుల ఏర్పాటు అత్యంత ఆవశ్యకమని తెలిపారు. అర్బన్‌పార్కులో కుటుంబంతో కలిసివచ్చి ఉల్లాసంగా గడపడానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ రవిప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, వైస్‌చైర్మన్ శ్రీనివాస్, ఎఫ్ఆర్‌వో పద్మారావు, మాజీసర్పంచ్ గంగాధర్‌గౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అటవీఅధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందుకు

మున్సిపాలిటీలో కలిపాక రూపు మారిన తారక రామానగర్

జగిత్యాల అర్బన్ (ఆంధ్రజ్యోతి): జగిత్యాల శివారులోని తారక రామానగర్ గ్రామాన్ని జగిత్యాల మున్సిపాలిటీలో కలిసిన తర్వాత అభివృద్ధిలో దూసుకుపోతోందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం తారకరామానగర్‌లోని 47, 48 వార్డుల్లో రూ.70 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తారకరామానగర్‌లోని ఇల్లు లేని 250 మందికి నూకపెల్లి అర్బన్ కాలనీలో డబుల్ బెడ్ రూం ఇళ్ల ఇచ్చామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు చాంద్ పాషా, దేవేందర్ నాయక్, ఏఈ శరణ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



రాయికల్ వార్డు సభలో మాట్లాడుతున్న జీవన్ రెడ్డి

రాయికల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం హయాలో సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలోని 10, 11, 12 వార్డుల్లో ప్రజాపాలన వార్డు సభలు నిర్వహించారు. 11వ వార్డు ప్రజాపాలన సభలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆదాయ పరిమితిని పరిగణలోకి తీసుకుంటూ అర్హులందరికీ రేషన్ కార్డును ప్రభుత్వం జారీ చేస్తుందన్నారు. పథకాలు రానివారు భయాందోళన చెందవద్దని లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని అన్నారు. జాబితాలో పేర్లు రాకపోతే సభలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. నిరుపేద వర్గాలకు, ఇల్లు లేనివాని, గుడిసెలో నివసిస్తున్నవారికి, వికలాంగులను, ఒంటరి మహిళలను, పేద ప్రజలను గుర్తించి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ప్రజలకు శుద్ధ జలాన్ని అందిం చాలనే లక్ష్యంతో మిషన్2.0 పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగానే రాయికల్ పట్టణంలో తాగునీటి సమస్యను తీర్చేందుకు అమృత్ 2.0 పథకాన్ని అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని, అందుకు స్థలసేకరణ చేపట్టాలన్నారు. మున్సిపల్ నుంచి స్థలం కొనుగోలుకు తీర్మానం చేపడితే కలెక్టర్ నుంచి ఆమోదం చేయిస్తానని హామీ ఇచ్చారు. దాతల సహకారంతో స్థలాన్ని కొనుగోలు చేపడితే తన వంతుగా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందిస్తానని ప్రకటించారు. గతంలో రాయికల్ పట్టణంలో నిర్మించతలపెట్టిన 60 డబుల్ బెడ్ రూం ఇళ్ల అసంపూర్తిగా ఉన్నాయని, నిధులు కేటాయించి డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, ప్రత్యేకాధికారి రాము, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

● సారంగాపూర్: నాలుగు సంక్షేమ పథకాల్లో దారుల ఎంపికలో అధికార యంత్రాంగానిదే పూర్తి బాధ్యత అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో ప్రజాపాలన గ్రామసభకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హాజరై మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపికలో అనుర్హులను ఎంపిక చేస్తే చట్ట పరమైన శిక్షలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ గంగాధర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్‌గా స్వామి



గొల్లపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట గ్రామానికి చెందిన బీజేపీ యువ నాయకుడు ముత్యాల స్వామి బీజేపీ ఓబీసీ మోర్చా నాయీబ్రాహ్మణ సెల్ జగిత్యాల నియోజవర్గ కన్వీనర్‌గా నియమితు లయ్యారు. ఈ మేరకు స్వామిని నియమిస్తూ నాయీబ్రాహ్మణ సెల్ రాష్ట్ర కన్వీనర్ గోవింద్ భక్ష్ ఆనంద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తనను నియమించిన రాష్ట్ర కన్వీనర్‌కు ఈ సందర్భంగా ముత్యాలస్వామి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్గం కౌన్సిలర్ల వాగ్వాదం



సభ్యుల వాగ్వాదం



మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

● జగిత్యాల మున్సిపల్ వీడ్కోలు సమావేశం

జగిత్యాల అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్ వీడ్కోలు సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వర్గం కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. ఆదివారంతో మున్సిపల్ కౌన్సిల్ పదవీ కాలం ముగియనుండటంతో శుక్రవారం జగిత్యాల మున్సిపల్ కౌన్సిల్ చివరి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించే క్రమంలో మున్సిపల్ అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధుల కోసం జీవన్ రెడ్డి ప్రతిపాదనలు పంపారని కౌన్సిలర్ కండపెల్లి దుర్గయ్య అన్నారు. అయితే జీవన్‌రెడ్డికి జగిత్యాల అభివృద్ధి మీద పట్టింపు లేదని అలా ఉన్నట్లయితే కౌన్సిల్ మీటింగ్‌కు ఎన్నిసార్లు వచ్చారో చెప్పాలని, సంజయ్‌కుమార్ మాత్రమే వచ్చారని కౌన్సిలర్ వొద్దినేని శ్రీలత, తోట మల్లికార్జున్ అన్నారు. జీవన్‌రెడ్డి గురించి మాట్లాడటం సరికాదని, మాటలు వెనక్కి తీసుకోవాలని దుర్గయ్య అన్నారు. దీంతో కౌన్సిలర్లు కోరె గంగమల్లు, పంబాల రామ్‌కుమార్, మల్లికార్జున్‌లు గత కౌన్సిల్‌లోనే వేగంగా విస్తరిస్తున్న జగిత్యాల పట్టణ అభివృ ద్ధికి రూ.100 కోట్ల నిధులు కావాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నేతృత్వంలో తీర్మానం చేశామని అనడంతో సమావేశంలో తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. మున్సిపల్ వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్‌కు దుర్గయ్యకు మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో చైర్మన్ అడువాల జ్యోతి సూచనతో మున్సిపల్ కమిషనర్ జోక్యం చేసుకుని వారిని శాంతింపజేశా రు.

● అభివృద్ధి నిరంతర ప్రక్రియ: ఎమ్మెల్యే

అభివృద్ధి అంటే నిరంతర ప్రక్రియ అని, అది ఎప్పటికీ కొనసాగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. అమృత్ సిటీలో భాగంగా జగిత్యాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి మాట్లాడుతూ తాను అధికారం చేపట్టిన తక్కువ సమయంలో చేసిన అభివృద్ధి సంతృప్తినిచ్చిందని, అందుకు సహకరించిన మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు, అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి సన్మానించారు.

బాలుడిపై లైంగిక దాడి?

వేములవాడ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలుడిపై 14ఏళ్ల బాలుడు లైంగికదాడికి పాల్పడినట్లు తెలిసింది. వేములవాడ మున్సిపల్‌పరిధిలోని ఓ కాలనీకిచెందిన బాలుడిపై గురువారం సాయంత్రం అదేకాలనీకి చెందిన 14ఏళ్ల బాలుడు అఘాయిత్యానికి పాల్పడడంతో బాలుడికి తీవ్ర రక్తస్రావమైంది. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో బాలుడిని ఆసుపత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ఇల్లంతకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన వెదిరె పరశురాంను అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి శుక్రవారం పేర్కొన్నారు. సీఐ తెలిపినవివరాల ప్రకారం.. కరీంనగర్ జైలులో జీవితఖైదు శిక్ష అనుభవిస్తున్న పరశురాంకు కరీంనగర్‌కు చెందిన బాధితురాలితో పరిచయం ఏర్పడింది. గతనెల 24న పెరోల్‌పై బయటకు వచ్చిన పరశురాం కరీంనగర్‌లో ఉన్న బాధితురాలి వద్దకు వెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈనెల 20న బాధితురాలిని తన ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి అనంతగిరి గ్రామానికి తీసుకవెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం పెద్దలింగాపూర్ గ్రామం వైపు ద్విచక్రవాహనంపై తీసుకొని వెళుతుండగా బాధితురాలు కేకలు వేయగా పరశురాం పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శుక్రవారంఅనంతగిరి గ్రామసమీపంలో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిపై గతంలో హత్య కేసుఉండగా జీవితఖైదు అనుభవిస్తున్నట్లు సీఐ తెలిపారు. సీఐ వెంట ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్‌తోపాటు పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

భీమారం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలకేంద్రానికి చెందిన చెరుకూరి లక్ష్మి(52) అనే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం- లక్ష్మి కొన్నిరోజుల నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన లక్ష్మి శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు లక్ష్మి కూతురు గుడ్ల స్వప్న ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు సంతానం కాగా అందరికీ వివాహాలు అయ్యాయి. కొడుకు ప్రస్తుతం గల్ఫ్ దేశంలో ఉంటున్నాడు.

విచ్చలవిడిగా గంజాయి



- వాట్సప్ గ్రూపుల ద్వారా అమ్మకాలు

జమ్మికుంట రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. గడిచిన ఏడాది కాలంలో గంజాయి విక్రయిస్తూ పోలీసులకు చిక్కిన వారిలో మహిళలు ఎక్కువగా ఉండడం విశేషం. మహిళల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని గంజాయి ముఠాలు వారిని ఈ ఊబిలోకి దింపుతున్నాయి. మహారాష్ట్ర నుంచి రైలు మార్గంలో వస్తువుల మధ్య గంజాయి ప్యాకెట్లు పెట్టి జమ్మికుంట రైల్వే స్టేషన్‌కు తీసుకు వస్తున్నారు. రైల్వే స్టేషన్‌ను ఆనుకోని ఉన్న కొత్తపల్లి నుంచి ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది.



మత్తుతో చిత్తు అవుతున్న యువత..

గంజాయి మత్తుకు ఎక్కువగా యువకులు బానిసలవుతున్నారు. వారిలో ఎక్కువగా 18 నుంచి25ఏళ్ల మధ్య వయస్సు వారు ఉంటున్నారు. మొదట సిగరెట్లకు అలువాటు పడుతున్న యువత తర్వాత గంజాయి వైపు మరలుతున్నారు. నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాగా చేసుకుని గంజాయి సేవిస్తున్నారు. మొదట సిగరేట్ ప్యాకెట్లు కొనుగోలు చేసి, అందులోని పొగాకు బయటకు తీసి గంజాయితో నింపి సేవిస్తున్నారు.గంజాయి కొనుగోలు చేసే వ్యక్తుల కోసం ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటు చేశారు. తమకు ఎంత మేరా గంజాయి కావాలో గ్రూపులో పోస్ట్ చేస్తే సదరు ఆడ్రస్‌కు క్షణాల్లో గంజాయిని చేర్చుతున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఇందుకు ఖరీదైన బైక్‌లు వాడుతున్నారు.

గంజాయి సేవించి వింత ప్రవర్తన..

తక్కువ ధరకు ఎక్కువ కిక్కు ఇస్తుండడంతో యువత గంజాయి వైపు ఆకర్షితులవుతున్నారు. గంజాయి సేవించిన తర్వాత వారి ప్రవర్తన వింతగా మారుతోంది. బైకులపై అతి వేగంగా ప్రమాదాలకు కారణమవుతున్నారు.

నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు కేసుల్లో నిందితుడు అశోక్‌కు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.100జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణం బీవై నగర్‌కు చెందిన ఎం భాస్కర్ అనే వ్యక్తి బైక్‌పై రాజీవ్‌నగర్ నుంచి బీవైనగర్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న సిరిసిల్ల పట్టణం సంజీవయ్యనగర్‌కు చెందిన యాలకుల అశోక్ అనే వ్యక్తి ఢీకొన్నాడని ఆయన తెలిపారు. దీంతో అశోక్, భాస్కర్‌తో గొడవ పడుతూ తాను పోలీసునని, తన మోటార్‌సైకిల్‌తో ఢీకొంటావా అంటూ రూ.3వేలు జరిమానా కట్టమని భాస్కర్‌ని బెదిరించాడన్నారు. డబ్బుల్లేవని బతిమిలాడినా వదలకుండా బలవంతంగా అశోక్ అనేవ్యక్తి భాస్కర్ ఏటీఎం కార్డు తీసుకొని డ్రాచేసుకున్నాడని ఆయన తెలిపారు. కొద్దిసేపటి తరువాత అతను పోలీస్ కాదని, డ్రైవర్ అని తెలుసుకొని భాస్కర్ అనేవ్యక్తి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు నమోదు చేసి విచారణ అనంతరం అప్పటి ఎస్ఐ బి శ్రీనివాస్ అరెస్ట్ చేసి రిమాండ్ చేశారన్నారు. మరోదొంగతనం కేసులో అశోక్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించారని ఆయన తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడికి ఏడు నెలలు..

ఇల్లంతకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఎల్లమ్మ గుడి ఆలయంలో జరిగిన దొంగతనం కేసులో సూర దేవేందర్ అనే నిందితుడికి సిరిసిల్ల రెండవ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి గడ్డం మేఘన జైలుశిక్ష విధించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. రెండు సంవత్సరాల క్రితం రేణుకాదేవి ఆలయంలో హుండీని పగలగొట్టి దేవేందర్ నగదు ఎత్తుకెళ్లాడు. కోర్టులో నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి 17 నెలల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఇల్లందకుంట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన చందగల్ల సాంబయ్య(60) చికిత్సపొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారుతెలిపిన వివరాల ప్రకారం.. మృతుడికి సరిగా మతిస్థిమితంలేదు. ఈ నెల20న ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యంతాగి, తలుపులు పెట్టుకొని ఇంటికి నిప్పటించాడు. దీంతో సాంబయ్యకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పిఅతనిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు.చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలు మృతి



మృతి చెందిన సావిత్రి

కరీంనగర్ అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కరీం నగర్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సావిత్రి(60) అనే వృద్ధు రాలు మృతిచెందిందని అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. రామ గుండం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గురువారం 108సిబ్బంది అంబులెన్స్‌లో సావిత్రిని తీసుకొచ్చి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలో అడ్మిట్ చేశారు. సావిత్రికి సంబంధించిన వారు ఎవరూ లేరని, ఆమెను గుర్తించినవారు కరీంనగర్ ప్రభుత్వాస్ప త్రిలోని అవుట్‌పోస్ట్ పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



గౌతమి (ఫైల్)

తిమ్మాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూరు శివారు మానకొండూరు వెళ్లే రహదారిపై గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహ నాన్ని ఢీకొన్న సంఘటనలో మహిళ మృతిచెందగా మృతురాలి భర్తకు గాయాలయ్యాయి. ఎల్ఎండీ ఎస్ఐ వివేక్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూరు మండలం అన్నారం గ్రామానికి చెందిన రుద్రోజు శ్రీనివాసచారి తన భార్య గౌతమి(30) వారి ఇద్దరు చిన్నపిల్లలు పాప రసజ్ఞ(3), బాబు రుద్రాంష్ (8నెలలు)తో కలిసి పనినిమిత్తం కరీంనగర్‌కు వారి ద్విచక్రవాహనం (టిఎస్02ఎఫ్‌బి 6995)పై వెళ్లారు. పని ముగించుకుని తిరిగి అన్నారంకు బయలుదేరి వెళుతుండగా అలుగునూరు శివారులోని లక్ష్మినరసింహ ఫంక్షన్‌హాల్ సమీపంలో గుర్తుతెలియని వాహనం వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ సంఘటనలో ద్విచక్రవాహనంపై వెనకాల కూర్చున్న గౌతమి కిందపడిపోగా ఆమె తలపై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త శ్రీనివాస్‌చారికి కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. పిల్లలు మాత్రం ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డారు. శ్రీనివాసచారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్ఐ వివేక్ తెలిపారు.

సైదాపూర్ మండలంలో ఒకరు..

సైదాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఘణపూర్ గ్రామానికి చెందిన గుంటి శ్రీనివాస్(38) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం- శ్రీనివాస్ దుద్దెనపల్లిలోని తన బంధువులు మృతి చెందగా, అంత్యక్రియలకు తన ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో దుద్దెనపల్లి, సైదాపూర్ మధ్య గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అనారోగ్యంతో ఒకరు..

హుజూరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం గణేష్‌నగర్‌కు చెందిన సోయం రాజు(30) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందినట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. గణేష్‌నగర్‌కు చెందిన రాజు ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికితోడు అతడు మద్యానికి బానిసవగా శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

మండల సరిహద్దులో పులి సంచారం..

- రాత్రి వేళల్లో రైతులు పొలాల వద్దకు వెళ్లవద్దు

చందుర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాలమండల సరిహద్దుల నుంచి చందుర్తి మండల సరిహద్దుల్లో పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించినందున మండల రైతులు, గొర్రెలకాపర్లు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి ఎస్ఐ అంజయ్య, అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాఘవేందర్‌రావులు శుక్రవారం తెలిపారు. కొడిమ్యాల మండలంలోని కొండాపూర్ శివారులో పులి ఓ ఆవును చంపిందని, మండలంలోని తిమ్మాపూర్, రామన్నపేట, నర్సింగాపూర్ గ్రామాల శివారులో సంచరిస్తోందన్నారు. రాత్రి సమయంలో రైతులు పొలాల వద్దకు వెళ్లకూడదని, మధ్యాహ్న సమయంలో కూడా ఒంటరిగా వెళ్లకూడదన్నారు. రాత్రి సమయంలో పొలాల వద్ద ఎలాంటి విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయకూడదన్నారు. ఎలాంటి సమాచారం తెలిసినా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని ఆవునూర్ మూలమలుపు వద్ద శుక్రవారం ఇసుక ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకటాపూర్, ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామాలకు చెందిన నర్సయ్య, సురేశ్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నర్సయ్య, సురేశ్‌లు తమ ద్విచక్రవాహనంపై వెంకటాపూర్ నుంచి ఆవునూర్ వైపు వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ అతివేగంగా ఢీకొట్టింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన హీక్యానాయక్ తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. హీక్యానాయక్ తన ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో కామారెడ్డి నుంచి ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం హీక్యానాయక్‌ను ఢీకొట్టింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

అనారోగ్యంతో ఎంఈవో మృతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఈసరి రవీందర్(57) అనారోగ్యంతో వరంగల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. రవీందర్ కొంతకాలంగా మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్నారు. పరిస్థితి విషమంగా మారడంతో వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ చనిపోయారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన ఎల్లారెడ్డిపేటకు తీసుకురావడంతో స్థానికంగా విషాదం నెలకొంది. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

పోరాట యోధుడు సర్వాయి పాపన్న

- పాపన్న చరిత్ర దేశానికి చాటిచెప్పేలా పాపన్న గుట్టల అభివృద్ధి
- సర్వాయిపాపన్న నివసించిన ప్రాంతం సర్వాయిపేటను పర్యాటక కేంద్రంగా మారుస్తాం
- పాపన్న గుట్టల అభివృద్ధికి త్వరలోనే మరిన్ని నిధులు
- సైదాపూర్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



సర్వాయి పాపన్న కోట అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని రాష్ట్రరవాణా, బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఆయన సైదాపూర్ మండలం సోమారం గ్రామశివారులోని మోడల్‌స్కూల్‌ను సందర్శించారు. స్కూల్ అభివృద్ధికి రూ.60లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రహరీ కోసం రూ. 48లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.12లక్షలు మంజూరు చేస్తానన్నారు. వెన్నంపల్లిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం సర్వాయిపేట శివారులోని కొమ్ము గుట్ట వద్ద ఉన్న సర్వాయిపాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వాయి పాపన్న గుట్టలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మంజూరు చేసిన రూ.4.70కోట్ల నిధులతో చేపట్టే పనుల ప్రారంభానికి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో మంత్రి పొన్నంప్రభాకర్ మాట్లాడుతూ సర్దార్‌సర్వాయి పాపన్న చరిత్రను దేశానికి చాటి చెప్పేలా పాపన్న నివసించిన ప్రాంతాన్ని అభివృద్ధిచేసి, పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతామన్నారు. ప్రస్తుతానికి సర్వాయిపేటగ్రామంలో సర్వాయిపాపన్న కోట అభివృద్ధికి మంజూరు చేసిన రూ.4.70కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. త్వరలోనే ఈ ప్రాంతం అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తామన్నారు. సర్వాయిపేట కోట పనులు పూర్తయ్యాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రారంభోత్సవం చేయిస్తామన్నారు. మరిన్ని నిధులతో మరోదశ అభివృద్ధిని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలాసత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ట్రైనీకలెక్టర్ అజయ్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, సహకార సంఘాల అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, తెలంగాణగౌడ సంఘం అధ్యక్షుడు భువనగిరి యాదగిరిగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ వ్యవహారంలో బెదిరింపులకు పాల్పడిన ముగ్గురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విక్రయించిన భూమిని తిరిగి అప్పగించాలని బెదిరింపులకు పాల్పడిన సిరిసిల్ల పట్టణంలోని బి.వై.నగర్‌కు చెందిన దండుగుల రాజు(48)తో పాటు కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన మెరుగు లక్ష్మన్(48), కోనరావుపేటకు చెందిన ముదాం ప్రసాద్(46) అనే ఇద్దరు మాజీనక్సలైట్‌లను శుక్రవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని వెంకటేశ్వర టెంపుల్ వీధికి చెందిన మర్రిపల్లి శ్రీనివాస్, అతడి సోదరులు కలిసి 2016లో స్థానిక సెహ్రా నగర్‌కు చెందిన నక్కరాజు వద్ద పెద్దూరు శివారులోని సర్వేనంబర్ 55జీలో 3.16ఎకరాల భూమిని కొనుగోలుచేసి వ్యవసాయం చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. 2015లో దండుగుల యాదమ్మ వద్ద నక్కరాజు అనే వ్యక్తి అట్టి భూమి కొనుగోలు చేయగా తర్వాత ధర పెరగడం వల్ల వారు అమ్మిన భూమిని ఎలాగైనా దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో మర్రిపల్లి శ్రీనివాస్‌ను ఎంత బెదిరించినా భయపడక పోవడంతో దండుగుల రాజు మాజీ నక్సలైట్ మెరుగు లక్ష్మన్, ముదాం ప్రసాద్‌లతో కుమ్మక్కై వారిని బెదిరించి భూమి లాక్కొని సగం సగం తీసుకోవాలని ప్రయత్నించారని తెలిపారు. ఇదే క్రమంలో పలుమార్లు శ్రీనివాస్‌ను బెదిరించి దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని చూడగా అప్పటికే దండుగుల రాజు, అతని తల్లి యాదమ్మ, భార్య లక్ష్మిలపై ఐదు కేసులు నమోదు అయ్యాయని ఆయన తెలిపారు. అయినప్పటికీ మర్రిపల్లి శ్రీనివాస్ భూమిని లాక్కోవాలనే ఉద్దేశ్యంతో జనవరి19న చంపుతామని బెదిరించారని, అంతేకాకుండా నక్కరాజు వద్ద రూ.16 లక్షల అప్పు తీసుకొని దానికి బదులుగా 3.16 ఎకరాల భూమి కుదువ పెట్టినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించి దానిని చూపిస్తూ భూమి తమ వారిదేనని బెదిరించారని ఆయన తెలిపారు. శ్రీనివాస ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ముగ్గురు నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు ఇదే అసలైన సమయం

- ఎవరు అడ్డుపడినా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధిద్దాం
- ఇంటికో డప్పుతో కదలండి.. విజయవంతం చేయండి..
- ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్ష డప్పులు మోగిద్దాం..
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



ర్యాలీలో డప్పు కొడుతున్న మందకృష్ణ మాదిగ

సిరిసిల్ల క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణ అమలుకు ఇదే అసలైన సమయమని, ఎవరు అడ్డుపడినా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధిద్దామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని కె కన్వెన్షన్‌లో 'లక్ష డప్పులు... వేల గొంతుల కార్యక్రమానికి తరలి రండి' సభ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొనపురం లక్ష్మణ్ మాదిగ అధ్యక్షతన భారీసభ నిర్వహించారు. ముందుగా సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి మందకృష్ణ మాదిగ పూలమాలలు వేసి, అంబేద్కర్ చౌరస్తా నుంచి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వరకు డప్పు చప్పుళ్లతో భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు... వేలాది గొంతులు అనే కార్యక్రమానికి ప్రతి ఇంటి నుంచి డప్పులతో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. డప్పులు లేకుండా రావద్దన్నారు. ఈ మహత్తర సాంస్కృతిక కార్యక్రమంపై ప్రపంచమే మనవైపు ఎదురు చూస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ ఇపుడు అమలు చేయకపోతే ఎపుడూ చేయలేమన్నారు. ఎస్సీలలో 58కులాలు ఒక వైపు ఉంటే ఒకే ఒక్క మాలలు మరోవైపు ఉన్నారన్నారు. ప్రతి 100మందిలో 80మంది మాదిగలుంటే 20మంది మాలలు ఉన్నారన్నారు. ఈ విధంగా రిజర్వేషన్లలోనూ అన్యాయం జరుగుతోందన్నారు. చెప్పులు కుట్టి, డప్పులు కొట్టి మాదిగలు సమాజానికి సేవ చేశారని, సాంప్రదాయ వాయిద్యంగా డప్పు చూసి గర్వపడాలన్నారు. ప్రతి ఇంటిలో డప్పులు ఉండాలని, ప్రతి మాదిగ బిడ్డ వెంటనే డప్పుకొని ఇంట్లో పెట్టుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం సాధించిన విజయఫలాలను మాదిగ బిడ్డలకు చేరకుండా మాలల వర్గం కుట్రలు చేస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఆగస్టు 1న ఏడుగురు జడ్జీల ధర్మాసనంలో ఆరుగురు జడ్జీలు అనుకూలంగా ఉండి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందని తీర్పు ఇచ్చిందన్నారు. నాలుగు నెలలైనా తెలంగాణలో అమలు చేయడంలేదని, తీర్పువచ్చిన రోజు అసెంబ్లీలో సీఎం అనుకూలంగా మాట్లాడారన్నారు. ఎస్సీ వర్గీకరణకు మాలల వర్గమే అడ్డుపడుతోందన్నారు. కార్యక్రమంలో ఉద్యమనాయకులు దరువు అంజన్న, ఏపూరి సోమన్న, భరత్, అశోక్, సంజీవ్ తదితర కళాకారులు డప్పు చప్పుళ్లు, ఆట పాటలతో హోరెత్తించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాసు, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్, అంకని బాను, ధామస్, ఎంఎస్‌పీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటస్వామి మాదిగ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రుద్రారపు రాంచంద్రం మాదిగ, సత్యనారాయణ, బాలరాజు, లక్ష్మన్, దేవయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చంపుతామని బెదిరించిన ఇద్దరి అరెస్టు

వేములవాడ రూరల్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): చంపుతామని బెదిరించిన ఇద్దరిని అరెస్టుచేసి రిమాండుకు తరలించినట్లు రూరల్‌సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. బోయినిపల్లి గ్రామానికిచెందినశ్రీనివాస్ హోటల్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. కూతురి వివాహం నిశ్చయం కావడంతో డబ్బు అవసరమై తన ఇంటిని అమ్మదలచి ఓ విలేకరి సహాయం కోరాడు. అతడు వేములవాడకు చెందిన కడారి తిరుపతి అనే రౌడీషీటర్‌ను శ్రీనివాస్ దగ్గరకు తీసుకువచ్చి ఇల్లు కొనడానికి రూ.50వేలు అడ్వాన్స్‌గా ఇచ్చి ఒప్పందం చేసుకున్నారు. తర్వాత డబ్బులు పూర్తిగా చెల్లించకుండానే చంపుతానని బెదిరించి ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్లను తిరుపతి తీసుకెళ్లడంతో బాధితుడు శ్రీనివాస్ బోయినిపల్లి పోలీసులను ఆశ్రయించాడు. దీంతోపోలీసులు కడారి తిరుపతి, పత్రికా విలేకరిని పట్టుకుని వారి వద్ద నుంచి ఇంటిపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టుచేసి రిమాండుకు తరలించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గంగాధర, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధురానగర్‌లో పేకాట రాయుళ్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. మధురానగర్‌శివారులోని మామిడి తోటలో పేకాడుతున్నారని పక్కాసమాచారం మేరకు దాడిచేసినట్లు తెలిపారు. ఈదాడిలో 8మంది పేకాడుతుండగా పట్టుబడినట్లు ఆయన తెలిపారు. వారినుంచి రూ.20,500లు, 7సెల్‌ఫోన్లు, 4బైకులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

'పొలాస'లో రైతులకు శిక్షణ


జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాసలో శుక్రవారం యాసంగి వరిలో ప్రధాన సమస్యలు, యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లా డుతూ వరిలో మొగిపురుగు నివారణకు కార్బోప్యూరాన్ 3సీజీ ఎకరానికి 10కిలోల చొప్పున 20-25 కిలోలు ఇసుకను కలుపుకొని బురద పదనలో చల్లాలన్నారు. ఈ సమావేశంలో పరిశోధన స్థానం ఏడీఆర్ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు బలరాం, స్వాతి, సాయినాథ్, రజినీకాంత్, మదన్‌మోహన్‌రెడ్డి, రజినీదేవి, శ్రీలక్ష్మీ, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల రైతులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు శుక్రవారం కరీంనగర్‌లోని అంబేద్కర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని 10 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ అప్పారావు, డాక్టర్ రాజగోపాల్, అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, సిరిసిల్ల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్ పరీక్షలు

తిమ్మాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ తొలివిడత ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీచైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, కరీంనగర్‌లోని వాణినికేతన్ డిగ్రీఅండ్‌పీజీ కళాశాలలో మొత్తం కలిపి నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నాలుగు పరీక్షా కేంద్రాల్లో కలిపి మొదటి సెషన్‌లో 967 మంది అభ్యర్థులకు 946మంది హాజరు కాగా 14మంది గైర్హాజరు అయ్యారు. రెండు సెషన్‌లలో కలిపి 1926మంది విద్యార్థులకు గాను 1891మంది హాజరు కాగా 35మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ టి లలిత కుమారి తెలిపారు.



సిరిసిల్ల మిడ్‌మానేరులో నిరుపయోగంగా బోటు

పర్యాటక శోభ ఏదీ?

- ధార్మిక, కార్మిక క్షేత్రానికి... పర్యాటక సొబగులు
- టెంపుల్ టూరిజం వైపు అడుగులు
- ప్రారంభోత్సవానికే పరిమితమైన మిడ్ మానేరు జల విహారం
- అనంతగిరి ప్రాజెక్టులో 40 ఎకరాల్లో ఐలాండ్

● 40 ఎకరాల్లో ఐలాండ్ అభివృద్ధికి మోక్షం కలిగేనా...?

ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద గుట్టలను అనుసంధానం చేస్తూ అన్నపూర్ణ, అనంతగిరి ప్రాజెక్టును నిర్మించారు. ఇక్కడే ఆసియాలోనే అతిపెద్ద సర్జ్ పూల్ బావిని కూడా నిర్మించారు. ప్రాజెక్టులో మధ్యలో ఉన్న 40 ఎకరాలతో ఉన్న గుట్టను ఐలాండ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించినా ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు. ప్రాజెక్ట్ వద్ద సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల ప్రజలకు ఎంతో ఇష్టమైన పోచమ్మ తల్లి దేవాలయం కూడా ఉంది. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఇక్కడికి వచ్చే పర్యాటకులు, వేములవాడకు వచ్చే యాత్రికులకు ప్రాజెక్ట్ ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుందని భావిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కార్మిక, కర్షక, ధార్మిక ఆధ్యాత్మిక జిల్లాగా రాజన్న సిరిసిల్ల నిలుస్తోంది. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నా పర్యాటకులకు నిరాశే కలుగుతోంది. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న జిల్లాలోని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. టెంపుల్ టూరిజానికి అవకాశం ఉన్నా గత ప్రభుత్వ హయాంలో అడుగులు పడలేదు. ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి. గత సంవత్సరం నవంబరులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి శంకుస్థాపనలతో అతిపెద్ద శైవక్షేత్రంగా పేరొందిన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని అద్భుతమైన రీతితో తీర్చిదిద్దేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో భారీ నిధులతో అభివృద్ధి చేస్తామన్న హామీలు కాగితాల మీద డిజైన్లుగా మాత్రమే ఆకర్షించాయి. కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సమయంలో పీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి వేములవాడ రాజన్నను దర్శించుకొని అభివృద్ధి చేస్తామని మాట ఇచ్చారు. మాటకు కట్టుబడి అధికారంలోకి రావడంతోనే బడ్జెట్‌లో రూ.50 కోట్లు నిధులు పొందుపర్చారు. దానికి అనుగుణంగానే వేములవాడలో ఇతర అభివృద్ధి పనులు దేవస్థానం ఆలయ విస్తరణకు రూ.127.65 కోట్లు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేశారు. దీంతో పాటు భక్తులకు, పర్యాటకుల కోసం అన్నదాన సత్రం కూడా నిర్మిస్తున్నారు.

● ఎదురు చూపుల్లోనే... జల విహారం

శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అనంతగిరి ప్రాజెక్ట్, ఎగువ మానేరు ప్రాజెక్టుల వద్ద పర్యాటక హంగులు కల్పించే దిశగా గత ప్రభుత్వం హడావిడి చేసినా పర్యాటకులకు జల విహారం ఎదురుచూపులే మిగిల్చింది. శాసనసభ ఎన్నికల సమయంలో శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కరకట్ట వద్ద అప్పటి మంత్రులు బోటును ప్రారంభించి జలవిహారానికి నాంది పలికినా ప్రారంభోత్సవం తోనే నిలిచిపోయింది. దాదాపు మూడు సంవత్సరాలుగా సిరిసిల్ల ప్రజలు జలవిహారానికి ఎదురుచూసినా నిరాశపర్చింది. ఇప్పటికీ ప్రారంభించిన బోట్లు కరకట్ట వద్ద వెక్కిరిస్తూ కనిపిస్తున్నాయి. జిల్లాలోని మిడ్‌మానేరు, అన్నపూర్ణ రెండు ప్రాజెక్టులు పర్యాటకానికి కీలకంగా మారుతాయని భావించారు. దక్షిణ కాశీగా వేమువాడల శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ప్రసిద్ధి చెంది ఆధ్యాత్మికతకు పర్యాటకం తోడవుతుందని అనుకున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలకు సిరిసిల్ల మానేరు తీరంలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్టులు ప్రధానంగా నిలుస్తాయి. ఈ ప్రాజెక్టుల వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని 2021 జూలై 4న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనంతగిరి పోచమ్మను దర్శించుకుంటానని అన్నపూర్ణ అనంతగిరి, శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులను పర్యాటక అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. వేములవాడ ఆధ్యాత్మికతకు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు పర్యాటకం కూడా స్వాగతం పలుకుతుందని భావించినా ఆచరణలోకి మాత్రం రాలేదు. మిడ్ మానేరు వద్ద కొడుముంజ గుట్టలకు కలుపుకొని రోప్‌వేలు, కాటేజ్‌ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. అదేక్రమంలో మిడ్ మానేరు బ్యాక్ వాటర్ సిరిసిల్ల కరకట్ట వద్ద బోటును కూడా సిద్ధం చేసినా కొవిడ్‌తో ప్రారంభానికి నోచుకోలేదు. శాసనసభ ఎన్నికల క్రమంలో గత సంవత్సరం ఆగస్టు 18న హడావిడిగా, నామామాత్రంగా ప్రారంభోత్సవం చేసి వదిలేశారు.



అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో మత్స్యకారులు (ఫైల్)



- స్టూడెంట్... టూరిజం
- తెలంగాణ దర్శిని పేరుతో పర్యాటక ప్రాంతాల సందర్శన
- నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

ప్రతి యేడాది జనవరి 25న దేశ వ్యాప్తంగా పర్యాటక దినోత్సవం జరుపుకుంటారు. భారతదేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సంప్రదాయ విలువల అభివృద్ధికి పర్యాటక రంగం తోడ్పడాలని టూరిస్ట్ ట్రాఫిక్ కమిటీ స్థాపించిన సందర్భంగా 1948 నుంచి జాతీయ పర్యాటక దినోత్సవాన్ని జరుపుతున్నారు. పర్యాటక రంగంలోని విభిన్న సంస్కృతులను ప్రోత్సహించడం, ఆయా పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేయడం, పర్యాటక ప్రాముఖ్యతను పెంచడమే లక్ష్యం.

సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) :దేశంలోని వివిధ ప్రాంతాలను, అక్కడి సంస్కృతులను తెలుసుకునేందుకు స్టూడెంట్ టూరిజంను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ విద్యా సంవత్సరం తెలంగాణ దర్శిని పేరిట పర్యాటక ప్రాంతాల సందర్శనకు అవకాశం ఇచ్చింది. ప్రభుత్వమే విహార యాత్రలకు అయ్యే ఖర్చులు భరిస్తుంది.

● పాఠశాలలో టూరిజం క్లబ్‌లు..

పాఠశాలల్లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం యువ టూరిజం క్లబ్‌లను కూడా ఏర్పాటు చేయనుంది. 7వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే విద్యార్థులకు టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి క్లబ్‌లో 25 మంది విద్యార్థులను సభ్యులుగా ఏర్పాటు చేస్తారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తూ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడే లక్ష్యంగా క్లబ్‌లు పనిచేసే విధంగా చూస్తారు. క్లబ్‌ల ద్వారా విద్యార్థి స్థాయి నుంచే సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించనున్నారు.

● పర్యాటక, విజ్ఞాన విహార కేంద్రాలు

మిడ్ మానేరు ప్రాజెక్ట్, ఎగువ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ ప్రాజెక్ట్, అర్బన్ పార్కులు, దిగువ మానేరు డ్యాం, ఉజ్వల, డీర్ పార్క్‌లు, ఎన్‌టీపీసీ రామగుండం, రామగిరి, ఎలగందుల, మొలంగూర్, కోటి లింగాల, జగిత్యాల, నగునూరు, మానకొండూరు కోటలు, సర్వాయి పాపన్న గుట్టలు, ధూళికట్ట బౌద్ధక్షేత్రం, వేములవాడ, గుండారం, బోల్, బుగ్గ, అక్కపల్లి, తోటపల్లి, మానకొండూరు, కొత్తపల్లి చెరువులు, కరీంనగర్ మ్యూజియం చూడదగ్గ ప్రాంతాలు. పొరుగు జిల్లాలోని బాస ర, అలీసాగర్, బోటానికల్ గార్డెన్, కోమటి చెరువులాంటి ప్రాం తాలను చూసే అవకాశం విద్యార్థులకు లభిస్తుంది.

పెద్దపులి సంచారంపై పరిశీలన

● నాలుగు బృందాల ఏర్పాటు

కొడిమ్యాల, జనవరి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్‌లో ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపడంతో అధికారులు, సిబ్బంది నాలుగు బృందాలుగా అటవీ ప్రాంతంలో పరిశీలిస్తున్నారు. పెద్దపెల్లి అటవీ కార్యాలయం నుంచి తీసుకొచ్చిన నాలుగు కెమెరా ట్రాప్‌లను కొండాపూర్ శివారు ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ మాట్లాడారు. కారిడార్ ఆధారంగా ఎస్ 12 అనే పెద్దపులి సిర్పూర్ నుంచి ఖానాపూర్ మీదుగా ఈ నెల 22న రాత్రి కొండాపూర్ అటవీ ప్రాంతానికి చేరుకున్నట్లు భావిస్తున్నామన్నారు. పెద్దపులి ఒక రోజులో నాలుగు దిక్కుల్లో 25 కిలోమీటర్ల చొప్పున 100 కిలోమీటర్ల పరిధిలో తిరుగుతుందని, ఆవాసాన్ని ఏర్పాటు చేసుకొని ఉండడానికి ప్రయత్నిస్తుందని, లేదా ఆ ప్రదేశం నుంచి వెళ్లిపోతుందని తెలిపారు. పెద్దపులి సంచారంతో వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ నుంచి కొండాపూర్, కొడిమ్యాల నుంచి కోనాపూర్, కోనాపూర్ నుంచి దమ్మయ్యపేట, దమ్మయ్యపేట నుంచి సూరంపేట అటవీ ప్రాంతాల్లో



అడవిలో పరిశీలిస్తున్న సిబ్బంది

పొలాల వద్దకు వెళ్లే రైతులను, పశువుల కాపరులను అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు. పంట రక్షణ కోసం ఎవరైన ఉచ్చులు, విద్యుత్ తీగలు, ఉరులు ఏర్పాటు చేస్తే తొలగించాలన్నారు. రాత్రి పూట బయటకు రావద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. డీఆర్వోలు ముషీర్ అహ్మద్ మోనిక, సెక్షన్ ఆఫీసర్లు రత్న, సుబ్బారావు ఉన్నారు.

● రక్షణ కోసం కర్రతో పొలాలకు వెళ్లండి



రేంజర్ మొయినుద్దీన్

కొడిమ్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతం గుండా పొలాలకు వెళ్లే రైతులతోపాటు గ్రామస్థులు రక్షణ కోసం కర్రకు చిన్న గంట కట్టుకొని వెంట తీసుకెళ్లాలని కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ సూచించారు. గురువారం మండలం లోని కొండాపూర్‌లో పెద్దపులి దాడిలో ఆవు మృతి చెందింది. ఈ సంఘటనలో శుక్రవారం కొడి మ్యాలలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీ ప్రాంతాల గుండా గ్రామస్తులు రాకపోకలు సాగించవద్దన్నారు. అటవీ శాఖ వారు ఏర్పాటు చేసిన చెక్ గేట్లకు అభ్యంతరం చెప్పవద్దన్నారు. అన్నదాతలు ఒంటరిగా కాకుండా 8 నుంచి 10 మంది కలిసి వెళ్లిరావాలన్నారు. 10 మందిలో ఇద్దరు డప్పు చప్పుడు చేయాలని, మరో ఇద్దరు విజిల్ వేయాలని సూచించారు. పొలాల వద్ద మంచె ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామం నుంచి అర కిలో మీటరు కన్నా ఎక్కువ దూరం గొర్రెలు, పశువులను మేతకు తీసుకెళ్లొద్దన్నారు. ఉదయం పది తర్వాత వెళ్లాలని, సాయంత్రం నాలుగు గంటల వరకు ఇంటికి చేరుకోవాలని అన్నారు. గ్రామ రక్షణ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పశువుల కాపరులకు పులి సంచారం, పగ్ మార్కులు కనిపిస్తే గ్రామ రక్షణ కమిటీలకు, అటవీ శాఖ అధికా రులకు సమాచారం అందించాలన్నారు. గ్రామస్తులు వెళ్లే ప్రాంతాల సమాచారాన్ని గ్రామ రక్షణ కమిటీలకు తెలుపాలన్నారు. పెద్ద పులికి ఎవరూ హాని చేయవద్దని, వలలు, ఉచ్చులు విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయవద్దని పేర్కొన్నారు. పులికి హాని కలిగించే వ్యక్తులపై వన్యప్రాణి రక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రేంజర్ వెంట డిప్యూటీ రేంజర్ ముషీర్ అహ్మద్ ఉన్నారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న రాజన్న ఆలయం

● ఆలయ గోపురాలకు రంగులు

వేములవాడ కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి జాతరకు ముస్తాబవుతోంది. మూడు రోజులపాటు నిర్వహించే మహాశివ రాత్రి జాతరను పురస్కరించుకొని ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు చకచకా నిర్వహిస్తు న్నారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, ఆలయ గోపురాలకు రంగులు వేస్తున్నారు. మహాశివ రాత్రికి రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చర్యలు తీసుకోనున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు.



రాజన్న ఆలయ గోపురాలకు రంగులు వేస్తున్న కార్మికులు

● రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తాం

- కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్, గృహనిర్మాణశాఖ మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్
- కరీంనగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కేంద్ర మంత్రి ఖట్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ అన్నారు. కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. మల్టిపర్పస్ పార్కు, అంబేద్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్సు, ప్రతిరోజూ నిరంతరం నల్లానీటి సరఫరా, ఈక్లాస్ రూమ్స్‌ను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాటా డారు. కేంద్రమంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ ప్రియమైన కరీంనగర్ ప్రజలారా నమస్తే... అంటూ తెలుగులో మాట్లాడటం ప్రారంభించి రెండు నిమిషాలపాటు తెలుగులోనే ప్రసంగించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని మా ప్రభుత్వం గత పదేళ్లలో 10 లక్షల కోట్లకు పైగా నిధులను తెలంగాణ అభివృద్ధి కోసం, ఇక్కడి ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేసిందన్నారు. కేంద్రం కేటాయించిన నిధులను సకా లంలో ఖర్చు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫల మైందన్నారు. ప్రభుత్వాలు, పార్టీలు వేరైనా కేంద్రం, రాష్ట్రం కలిసికట్టుగా ముందుకెళ్లాల్సిన అవసర ముందని అన్నారు. తెలంగాణ విషయంలో కేంద్రం వివక్ష చూపుతుందంటూ చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. తెలంగాణలో రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధికి గత పదేళ్లలో రూ. 32,946కోట్లను కేటాయించి రాష్ట్రంలో రైల్వే స్టేషన్ల రూపురేఖలే మారుస్తున్నామని చెప్పారు. రామగుండంలో యూరియా పరిశ్రమ ఏర్పాటు చేసి ఎరువుల కొరత లేకుండా చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని కేంద్రమంత్రి ఖట్టర్ అన్నారు. రోజ్‌గార్ మేళా పేరుతో ఎలాంటి అవినీతికి, జాప్యానికి తావు లేకుండా నిర్ణీత వ్యవధిలో పరీక్షలు నిర్వహించి 9.25 లక్షల మందికి నియామక పత్రాలు అందించామన్నారు.

● కరోనాను అరికట్టడంలో కరీంనగర్ ఆదర్శం

కరోనా సమయంలో ఒకేసారి 13 పాజిటివ్ కేసులు ఈ కరీంనగర్‌లోనే మొదటిసారి వచ్చాయని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ అన్నారు. ఆ సమయంలో మొదటిసారి గెలిసిన ఎంపీ బండి సంజయ్.. వైద్య సిబ్బందికి అండగా నిలిచి అతనే నేరుగా.. జిల్లా ఆసుపత్రిని సందర్శించిన వార్తలు తాను చూశానన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో క్వారంటైన్ విధానాన్ని మొదటిసారి అవలంభించి కరోనా వ్యాప్తి చెందకుండా అరికట్టారన్నారు. వ్యాక్సినేషన్ విషయంలోనూ ఇక్కడే మొదటిసారి అందరికీ పూర్తి చేసి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. వాటర్ ప్లస్ కార్యక్రమంలో భాగంగా.. కరీంనగర్ కార్పొరేషన్‌లో వాడిన నీటిని మళ్లీ యుటిలైజేషన్ చేసే విషయంలో 2023లో కరీంనగర్ మంచిస్థానంలో నిలిచిందని అన్నారు. నిధులను సక్రమంగా వినియోగించుకోవడంలో కరీంనగర్ ముందంజలో ఉందని అన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీలో భాగంగా కమాండ్ కంట్రోల్ ఆధునీకరించారని, దీనితో ప్రజల భద్రతకు మరింత మేలు జరుగుతుందని అన్నారు. స్మార్ట్‌క్లాస్ ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన బోధన అందుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల కోసం పట్టణాల్లో అమలు చేస్తున్న పీఎం స్వనిధి పథకం అమలు విషయంలో కరీంనగర్ దేశంలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఇక్కడ దాదాపు 1200 మంది వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రుణసహాయం అందుతుందని అన్నారు. కరీంనగర్‌లో డంపింగ్ యార్డు సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని కేంద్రం అందిస్తుందని మంత్రి ఖట్టర్ హామీ ఇచ్చారు.



అంబేద్కర్ స్టేడియంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్

కరీంనగర్ జిల్లా అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి

● మంత్రి పొన్నం ప్రభాకర్



రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా జిల్లా అభివృద్ధిలో నెంబర్‌వన్‌గా ఉండేందుకు అందరూ సహకరించాలని అన్నారు. డంపుయార్డు సమస్య పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కేంద్ర ప్రభుత్వం కూడా సహక రించాలని కోరారు. కరీంనగర్ స్మార్ట్‌సిటీకి మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తోపాటు ఎంపీగా తాను, ప్రస్తుతం ఎంపీ, మంత్రి సంజయ్ కృషిచేశామని చెప్పారు.

సొంతింటి కల సాకారం చేసుకునేలా చూడాలి

● మంత్రి పొంగులేటి



రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాల్లో స్వంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఇళ్లను మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద తెలంగాణకు 8శాతం ఇండ్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం 0.7శాతం మాత్రమే ఇండ్లు వచ్చాయని అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా మేరకు సంక్షేమ పథకాలు, నిధులు తెచ్చేందుకు తెలంగాణకు చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ కృషిచేయాలని శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

మిల్లర్లు లక్ష్యాన్ని అధిగమించాలి

జగిత్యాల అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్లు ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాన్ని అదిగమించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత రైస్ మిల్లర్లలకు సూచించారు. ఇటీవల ఎంపికైన జిల్లా రా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మైలారపు రాంబాబు అదనపు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాటాడుతూ జిల్లాలో సీఎంఆర్ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా రా రైస్ మిల్లర్ల సంఘం మాజీ అధ్యక్షుడు నూనె శ్రీనివాస్, నాయకులు దువ్వ రాజు, పోచమల్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి అంజన్న చిత్రపటం అందజేత

మల్యాల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభానికి వచ్చిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రికి మండల బీజేపీ నాయకులు కొండగట్టు ఆంజనేయస్వామి చిత్రపటం అందజేశారు. ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్‌తో కలిసి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, మండల శాఖ అధ్యక్షుడు గాజుల మల్లేశం, కెల్లెటి రమేశ్, రాజశేఖర్, రవి, చక్రంగౌడ్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ముత్యంపేటలో చోరీ

మల్లాపూర్, జనవరి, 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్యంపేట గ్రామంలో శుక్రవారం పుల్లూరి నరేష్ అనే వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువా లోని బంగారు ఆభరణాలు, నగదును అపహరించినట్లు స్థానికులు తెలిపారు. కుటుంబీకులు ఇంటికి తాళం వేసి శుభకార్యక్రమం నిమిత్తం మరో గ్రామానికి వెళ్లారు. తిరిగి ఇంటికి చేరుకున్న నరేష్ కుటుంబీకులకు ఎవరో ఇంట్లోకి చొరబడినట్లు ఆనవాళ్లు గ్రహించారు. బీరువా పగలగొట్టి సుమారు 12తులాల బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

కొడిమ్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో గురువారం అదె గ్రామానికి చెందిన గుండు బాబు అనే రైతుకు చెందిన ఆవు పెద్దపులి దాడిలో మృతి చెందినది. శుక్రవారం కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ , డీఎఫ్ఆర్వోలు ముషీర్ అహ్మద్, మోనిక పెద్ద పులి బాధితుడు గుండు బాబుకు 5వేల రూపాయల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు. రేంజర్ వెంట రేంజ్ పరిదిలోని సెక్షన్ ఆఫీసర్లు రత్న, సుబ్బారావు బీట్ ఆఫీసర్లు ప్రవీణ్, అశ్విని, వసీం, ఆనందరావు, ఫిరోజ్, బేస్ క్యాంప్ సిబ్బంది మహేందర్, దేవెందర్, వాచర్లు, తదితరులు ఉన్నారు.

నిలదీతలు..వాగ్వాదాలు

- జిల్లాలో ముగిసిన గ్రామసభలు
- పలుచోట్ల అర్హుల జాబితాల్లో పేరులేదని ప్రజల ఆందోళన
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం



రంగసాగర్‌లో పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న శంకరయ్య, మల్లాపూర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ప్రారంభించనున్న నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికకు నాలుగు రోజుల పాటు గ్రామసభలను నిర్వహించింది. ఈ సభలు శుక్రవారం ముగిసాయి. చివరిరోజు జిల్లాలో పలు గ్రామాల్లో, పట్టణాల్లో జరిగిన సభల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అర్హుల జాబితాల్లో తమ పేరులేదని పలువురు దరఖాస్తుదారులు అధికారులను నిలదీశారు.

జగిత్యాల అర్బన్, (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణంలోని19, 22, 25, 36, 44, 46,48 వార్డులలో శుక్రవారం వార్డు సభలు జరిగినాయి. అయా వార్డులో ప్రజలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం వార్డు అధికారులకు తమ దరఖాస్తులను అందజేశారు. అయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్, కమలాపూర్, పెద్దనక్కలపేట, తుమ్మెనాల, బురుదేశిపల్లె, నర్సయ్యపల్లెలో గ్రామ సభలు నిర్వహించారు. ప్రత్యేక అధికారి రాంచందర్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో నరేష్‌కుమార్, పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈలు ముకరం, వివేకానంద, డిప్యూటీ తహసీల్దార్ సుమన్, గ్రామపంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కథలాపూర్(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంభీర్‌పూర్, తాండ్ర్యాల, సిరికొండ, తక్కళ్లపల్లిలో గ్రామసభలు జరిగాయి. కార్యక్రమాల్లో ఎంపీడీవో శంకర్, ఏవో యోగిత, తహసీల్దార్ వినోద్ ఉన్నారు.

వెల్గటూర్ (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని ఎండపల్లి, ముత్తునూర్, కొత్తపేట, వెల్గటూర్, పైడిపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్‌లు శేఖర్, రవికాంత్, ఏవో సాయికుమార్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మల్యాల(ఆంధ్రజ్యోతి): మల్యాల, ముత్యంపేట, తాటిపల్లి, పోతారం, రాజారం, గొల్లపల్లిలో గ్రామసభలు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, ఎంపీడీవో స్వాతి, తహసీల్దార్ మునీందర్, వ్యవసాయ అధికారి చంద్రదీపక్, వెటర్నరీ అధికారి రాజ్‌కుమార్, ఎంపీవో ప్రవీణ్, మల్యాల ఈవో శ్రీకాంత్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాయికల్ (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని అల్లీపూర్, దావన్‌పెల్లి, భూపతిపూర్, అలూరు, మహితాపూర్, బోర్నపెల్లి, కుర్మపల్లిలో గ్రామసభ నిర్వహించారు. లబ్ధిదారుల జాబితాలో అర్హులైన వారి పేర్లు లేవని ప్రజలు నిరసన తెలిపారు.

ఇబ్రహీంపట్నం(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోధుర్, వేములకుర్తి, ఇబ్రహీంపట్నంలో గ్రామసభలు నిర్వహించగా ఇబ్రహీంపట్నంలో జరిగిన సభలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామ సభలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిసాయి. గ్రామ సభలలో మండల ప్రత్యేకాధికారి ఎస్ఎల్ మనోహర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంపీవో మహేందర్, నాయబ్ తహసీల్దార్ లాస్యశ్రీ, ఏఈలు శంషేర్‌అలీ, శ్రీమాన్, పంచాయతీకార్యర్శులు పాల్గొన్నారు.

కొడిమ్యాల(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ, చెప్యాలలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● పురుగుల మందు డబ్బాతో నిరసన

బీర్‌పూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్న కొల్వాయి, కోమన్‌పెల్లి, రంగసాగర్‌లో గ్రామ సభలను నిర్వహించారు. రంగసాగర్ గ్రామంలో సంగ శంకరయ్య అనే వ్యక్తి ఇందిరమ్మ ఇళ్ళలో తన పేరు ఎందుకు పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపాడు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో తమ పేర్లు ఎందుకు రాలేదని పలువురు అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజిబుద్దిన్, ఎంపీడీవో లచ్చాలు, పంచాయతీరాజ్ ఏఈ విశ్వేందర్‌రావు, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి రాజుకుమార్ పాల్గొన్నారు.

లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలి

గొల్లపల్లి (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేయనున్న సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అధికారులను ఆదేశించారు. శుక్రవారం గొల్లపల్లి మండలం వెన్గుమట్లలో జరిగిన ప్రజాపాలన గ్రామసభను అదనపు కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరందన్, మండల ప్రత్యేకాధికారి డా. కిషోర్, ఎంపీడీవో రాంరెడ్డి, ఏవో కరుణ, ఎంపీవో సురేష్‌రెడ్డి, పీఆర్ ఏఈ కళ్యాణ్ పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో ఫ్లెక్సీ వివాదం

మల్లాపూర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ఫ్లెక్సీ వివాదం చోటుచేసుకుంది. గ్రామసభ సందర్భంగా ప్రదర్శించిన ఫ్లెక్సీలో బీఆర్ఎస్‌కు చెందిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఫొటో లేదంటూ ఆ పార్టీ నేతలు నిరసనకు దిగారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. గ్రామసభ కాంగ్రెస్ ప్రచార సభగా మారిందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ వ్యాఖ్యానించారు. సుమారు అరగంట పాటు రసాభసాగా గ్రామ సభ కొనసాగింది. పోలీసుల జోక్యంతో వివాదం ఎట్టకేలకు సద్దుమనిగింది.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

కోరుట్ల రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడిమడుగులో గ్రామసభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో వాగ్వాదం జరిగింది. ఎంపీడీవో రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారిణి నాగమణి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి లబ్ధిదారుల పేర్లను ప్రకటించారు. అర్హుల జాబితాలో తమ పేరులేదని న్యాయం చేయాలని పలువురు మహిళలు సభకు హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ ప్రసంగం చేశారని కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో తోపులాట చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరు పార్టీల నేతలను అక్కడి నుంచి పంపించివేశారు. మండలంలోని యూసుఫ్ నగర్, వెంకటాపూర్‌లో గ్రామసభలు నిర్వహించగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్: పట్టణంలోని 21వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. పట్టణంలోని 3,6,9,12,21,24 వార్డుల్లో సభలు నిర్వహించారు. మెట్‌పల్లి మున్సిపల్‌లోని 6వ, 21వ వార్డుల్లో నిర్వహిం చిన వార్డు సభల్లో సైతం బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వార్డు సభకు హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ హాజరై ప్రసగింస్తుండగా కాంగ్రెస్ నేతలు అడ్డుకొని రాజకీయ ప్రసంగం చేస్తున్నారనడంతో రభస జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తీవ్రవాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్‌రావు వార్డు సభ జరుగుతున్న ప్రదేశానికి రావడాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మరోమారు ఇరుపార్టీ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. నేతలు కార్యకర్తలను సముదాయించడంతో గొడవ సద్దుమనిగింది.


పైడిమడుగులో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల తోపులాట

దరఖాస్తుల వెల్లువ

5వ పేజీ తరువాయి

నిర్వహించిన గ్రామసభలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మేడిపల్లి సత్యంలతో పాటు కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, నాలుగు రోజుల్లో పలుచోట్ల సభలను సందర్శించారు. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో జరిగిన సభలో లబ్ధిదారుల ఎంపికలో గ్రామ కార్యదర్శి అవినీతికి, అక్రమాలకు పాల్పడ్డాని ఆరోపణలు రావడం, అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడాన్ని కారణం చెప్పమంటూ పలువురు నిలదీశారు. దీంతో ఉన్నతాధికారులు విచారణ జరిపి ఇచ్చిన నివేదిక మేరకు సదరు కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. పలు చోట్ల గ్రామ సభలు గందరగోళంగా మారగా ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు వెళ్లి నచ్చచెప్పడంతో ఆందోళనలు సద్దుమనిగాయి.

● దరఖాస్తుదారులతో కిటకిట...

జిల్లాలో నాలుగురోజుల పాటు నిర్వహించిన వార్డు సభలు, గ్రామసభల వద్ద జన సందోహం కనిపించింది. చాలా చోట్ల ప్రజలు నిరసనలు తెలిపారు. జాబితాల్లో పేర్లు రానివారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో బారులు దీరి సమర్పించారు. ప్రధానంగా మున్సిపాలిటీల్లో దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. ఇందులో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు కావాలంటూ దరఖాస్తు చేసుకున్న వారు అధికంగా ఉన్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదు..



- బాలే చిన్న రాజు, వృద్ధురాలు, జగిత్యాల

ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేసుకున్న ప్పటికీ అర్హుల ఎంపిక జాబితాల్లో నాకు చోటు లభించలేదు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు పెన్షన్ మంజూరు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అర్హుల ఎంపికలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి.

అర్హులను గుర్తించి న్యాయం చేయాలి..



- నానవంది వెంకటేశ్, యువకుడు, జగిత్యాల

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో లబ్ధిదారుల జాబితాలో పేదవారి కంటే ఆర్థికంగా ఉన్న వారికి అవకాశం కల్పించారు. అర్హుల ఎంపికలో అధికారులు అవకతవకలకు పాల్పడ్డారు. అధికారులు స్పందించి నిజమైన అర్హులను గుర్తించి పేదలకు న్యాయం చేయాలి.

ఒంటిపై పెట్రోలు పోసుకొని మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

మల్లాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న దాదాపుగా రూ. 20 లక్షల బిల్లులు చెల్లించాలని, కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తించేలా గ్రామ సభను నిర్వహిస్తున్నారంటూ జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట మాజీ సర్పంచ్ వనతడపుల నాగరాజు ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శుక్రవారం మొగిలిపేటలో అర్హులైన లబ్ధిదారుల గుర్తింపునకు నిర్వహించిన గ్రామసభకు మాజీ సర్పంచ్ నాగరాజు హాజరై అధికారులతో వాగ్వాదానికి దిగుతూ ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకొని నాగరాజును అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నాగరాజు స్థానిక విలేకరులతో మాట్లాడారు. తమ పాలకవర్గం సమయంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి 20 లక్షల రూపాయలు చెల్లింపులు జరగడం లేదన్నారు. భార్యాపిల్లల బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి అభివృద్ధి పనులు నిర్వహించామన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమం కింద పాఠశాల అభివృద్ధి పనులు, సీసీ రహదారుల నిర్మాణ పనులు, సీడీపీ గ్రాంటు కింద చేసిన అభివృద్ధి పనులు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలకు, అభిమానులకు మాత్రమే సంక్షేమ పథకాలు వర్తింపజేసే విధంగా గ్రామసభను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా అర్హుల జాబితాలో అనర్హులకు చోటు కల్పించారని విమర్శించారు.

● మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామసభలో స్థానిక మాజీ సర్పంచ్ నాగరాజు తీరుపై కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన సభలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిరసన వ్యక్తం చేయడం కేవలం ఓట్ల కోసమేనని అన్నారు. సమావేశంలో నాయకులు ఎనడ్ల రాములు, మహబూబ్‌ఖాన్, జలపతిరెడ్డి, జగదీశ్వర్, చిన్నయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లల విద్యను ప్రోత్సహించాలి: డీఈవో



రాయికల్ కస్తూర్బా పాఠశాలలో ముగ్గును ప్రదర్శిస్తున్న విద్యార్థినులు, జగిత్యాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

రాయికల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లల విద్యను ప్రోత్సహించాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. మండలంలోని ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో విద్య పోషణ, చట్టపరమైన హక్కులు, బాల్య వివాహాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో, జీసీడీవో, పాఠశాల ప్రత్యేకాధికారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాయికల్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొన్నం రమేష్, రవీందర్, మల్లేశం, గంగజమున, సత్యనారాయణ, అలీ, రాజా, నాగరాజు, తిరుమల, సామల గంగాధర్, వనిత, పారిపెల్లి గంగాధర్, ఫాతిమా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్ (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని జగిత్యాల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి హేమంత్ అన్నారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలోని బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఎంఏ ఆధ్వర్యంలో 187 మంది విద్యార్థులకు అనీమియా పరీక్షలు నిర్వహిచారు. రక్తహీనత కలిగిన 65 మంది బాలికలను గుర్తించి వారికి కావాల్సిన మందులను అందించారు. కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, కె సుధీర్, డాక్టర్ కనకదుర్గ, డాక్టర్ శ్రీలత, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ శావణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్: పట్టణంలోని ఆరపేట ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో మండల లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగేశ్వరరావు విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

జగిత్యాల అగ్రికల్చర్: జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక నవ్య బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ద్వితీయ సంవత్సర విద్యార్థినుల కోసం నిర్వహించిన వేడుకల్లో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్, ప్రిన్సిపాల్ గాలిపెల్లి ఈశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: గొల్లపల్లి ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ సుంకె రవి గర్ల్స్ చైల్డ్ ఎంపవర్‌మెంట్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం లీడ్ ఇండి యా ట్రైనర్లు శ్రీనివాస్, తిరుపతి విద్యార్థినులకు మార్గనిర్ధేశం చేశారు. వైస్‌ప్రిన్సిపాల్ తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెనాల్‌లో పడి రైతుకు తీవ్రగాయాలు

జగిత్యాలరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో ధరూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే రైతు ప్రమాదవశాత్తు జారిపడగా తీవ్రగాయాలయ్యాయి. స్థానిక రైతుల వివరాల ప్రకారం.. ఆంజనేయులు కెనాల్‌లోని తన వ్యవసాయ మోటారు పైపు బిగిస్తుండగా షార్ట్‌సర్క్యూట్ జరిగి ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడిపోయాడు. రైతులు, ఫైర్ సిబ్బంది, పోలీసులు రైతును పైకి తీసుకొచ్చి 108లో ఆసుపత్రికి తరలించారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలు

ధర్మపురి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 2025-26వ సంవత్సరానికి ఐదో తరగతిలో 40 సీట్లు కులాల వారీగా కేటాయించినట్లు ప్రిన్సిపల్ ఆర్ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ముస్లీం మైనార్టీలకు 26, క్రిష్టియన్ మైనార్టీ 2, జైన్స్, పార్సిస్, బుద్దిస్ట్, సిక్కులకు 2, ఎస్సీ 2, ఎస్టీ 2, బీసీ 5, ఓసీలు ఒక సీటు సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. వివరాల కోసం ఫోన్ నంబర్ 7995057966 సంప్రదించాలని ఆమె కోరారు.

మగ్గిడి ఆదర్శ పాఠశాలలో..

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని మగ్గిడి ఆదర్శ పాఠశాలలో 100 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపల్ పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం ఆరో తరగతిలో 100 సీట్ల భర్తీ కోసం అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. అలాగే 7, 8, 9 వ తరగతుల్లో ఖాళీ సీట్లలో ప్రవేశం పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకునేందుకు ఫిబ్రవరి 28 వరకు గడువు ఉందని ఆమె తెలిపారు. ఆసక్తి కలిగి ఉన్న విద్యార్థులు సకాలంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

● సంక్షిప్తం..

మెట్‌పల్లి రూరల్: అమెరికాలోని ప్రఖ్యాత గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ(గేట్స్) అధ్యక్షుడిగా మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన బత్తిని నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గ్రామస్తులు తెలిపారు.

కథలాపూర్: గంభీర్‌పూర్‌ను మండలం చేయాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందజేశారు.

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన సుమారు 60 శాతం మందికి రుణమాఫీ జరుగలేదని వారికి రుణమాఫీ అందించాలని కోరుతూ రైతులు శుక్రవారం ఎంపీడీవో రామకృష్ణ, ఏఈవో షమీనాకు వినతి పత్రం అందించారు.

బీర్‌పూర్: బీర్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ బైరవేణి ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మృతుడి కుటుంబ సభ్యుల ను పరామర్శించారు.

జగిత్యాల అర్బన్: ఈ నెల 26న గణతంత్ర వేడుకల్లో జెండా గద్దె వద్ద రాజ్యాంగా నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటంతో పాటు రాజ్యాంగాన్ని పెట్టాలని జిల్లా ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కోరారు.

జగిత్యాల అగ్రికల్చర్: జగిత్యాల పట్టణ కేంద్రంలో భరతమాత విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ బల్దియా ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతిని కలిసి భారత సురక్షా సమితి నాయకులు వినతిపత్రం సమర్పించారు.

కొడిమ్యాల: ప్రజాపాలనా పేరున కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు బి నర్సింహరెడ్డి అన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే మరో కార్యాచరణ

విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు

జగిత్యాల అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) తమ సమస్యలు పరిష్కరించకుంటే మరో కార్యాచరణకు సిద్ధం అవుతామని విద్యుత్ ఆర్టిజన్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జగిత్యాల జిల్లా కేంద్రలోని విద్యుత్ ప్రగతి భవనం ఎదుట నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆర్టిజన్ల నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం ముగించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఆర్టిజన్ల రాష్ట్ర జేఏసీ కార్యదర్శి దమ్మ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం త్వరలో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపడుతామన్నారు. అనంతరం రాష్ట్ర శాఖ నిర్ణయం మేరకు కార్యాచరణ చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు అరుముళ్ళ శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, బొజ్జ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతోనే ప్రమాదాల నివారణ: డీటీవో



కోరుట్లలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బంది, విద్యార్థులు

కోరుట్ల జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తతో ప్రమాదాలు నివారించవచ్చునని డీటీవో శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్స్ డే వేడుకలను డీటీవో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లను సన్మానించి రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ ర్యాలీని నిర్వహించారు. డిపో మేనేజర్ మనోహర్, ఆర్టీసీ డ్రైవర్లు సిబ్బంది పాల్గొన్నారు.

● డిపోను సందర్శించి రీజినల్ మేనేజర్

పట్టణంలోని ఆర్‌టీసీ డిపోను కరీంనగర్ రీజినల్ మేనేజర్ రాజు సందర్శించారు. రీజినల్ మేనేజర్‌కు డిపో సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఆర్ఎం రాజు డిపో ఆవరణలో మొక్కను నాటి పరిరక్షనకు టీ గార్డును ఏర్పాటు చేశారు. ఆర్ఎం రాజు బస్సుల రూట్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిపోలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమలో డిపో మేనేజర్ మనోహర్, సూపరింటెండెంట్ గంగారాం, డిప్యూటీ సూపరింటెండెంట్ బాబు, పాల్గొన్నారు.

● డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి టౌన్: డ్రైవింగ్ చేసే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని మెట్‌పల్లి డీఎస్పీ ఎ రాములు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆర్టీసీ డిపోలో భద్రత మాసోత్సవాలలో భాగంగా డ్రైవర్స్ డే నిర్వహించారు. డిపో నుంచి బస్టాండ్ వరకు సాయి చైతన్య పాఠశాల విద్యార్థులతో కలిసి డీఎస్పీ రాములు, డీఎం దేవరాజ్, ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ సిబ్బంది ఐఆర్‌కె రెడ్డి, పవన్, నాగన్న, రమేష్, రాఘవ, నారయణ పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్: డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలో విద్యార్థినులతో కలిసి డ్రైవర్ల విధులు, నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. పట్టణంలో బస్ డిపో నుంచి కొత్త బస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. డిపో మేనేజర్ సునీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి హాంఫట్

- రికార్డులు మార్చి పట్టాదారుపుస్తకాలు పొందిన అక్రమార్కులు
- మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫిర్యాదుతో వెలుగులోకి
- స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్‌కు మంత్రి ఆదేశాలు


నర్సింగాపూర్‌లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

జగిత్యాలరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో రియల్ ఎస్టేట్ మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. జగిత్యాల జిల్లాగా ఏర్పడడంతో భూముల ధరలు అమాంతం పెరిగాయి. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు రియల్టర్లు, భూ అక్రమార్కులు ప్రభుత్వ భూములపై కన్నేశారు. అనుమతులు లేకుండా అధికారులకు మామూళ్లు అప్పజెప్పి ప్రభుత్వ భూములను పట్టాలుగా మార్చుకున్నారు. కొందరు లేఅవుట్ ద్వారా ప్లాట్స్ ఏర్పాటు చేసి అమాయక ప్రజలకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. మరికొంత మంది ప్రభుత్వ భూములను వ్యవసాయభూములుగా ధరణి రికార్డుల్లో మార్చి రైతుబంధు సైతం తీసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మూడు రోజుల క్రితం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి స్వయంగా ఫిర్యాదు చేసి నివేదిక అందించడంతో భూ అక్రమార్కుల బండారం బట్టబయలైంది.

వివరాల్లోకి వెళ్తే... జగిత్యాల జిల్లాలోని జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ శివారులోని సర్వేనంబరు 437లో 378 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో 78 ఎకరాలకు పైగా స్థలాలను పేదలకు పంపిణీ చేయగా మరో 300 ఎకరాల వరకు రెవెన్యూ రికార్డుల్లో ఉండాలి. రికార్డుల్లో 220 ఎకరాలు మాత్రమే ఉంది. దీంతో సర్వేనంబరు 437లో పట్టాలు పొందిన వారి వివరాలు కోరుతూ కొన్నిరోజుల క్రితం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రెవెన్యూ అధికారులకు లేఖరాశారు. ఈ లేఖ ఆధారంగా అధికారులు సర్వే చేపట్టి 2014 ముందు పహణీలు, కొత్తగా పట్టాలు పొందిన వివరాలతో నివేదిక రూపొందించారు. కొందరిపేరిట ప్రభుత్వభూములకు పాసుపుస్తకాలు జారీ అయినట్లు ఈ సర్వే ద్వారా వెల్లడైంది. ప్రభుత్వ స్థలాలు పట్టాలు పొందినవారిలో 100కు పైగా ఉన్నారని, వారిలో కొందరు కీలక రాజకీయనాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. బుధవారం ధర్మపురి మండలం జైన గ్రామానికి వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అందుకు సంబంధించిన నివేదికను అందజేశారు. ఈమేరకు అక్రమంగా పట్టాలు పొందిన వారి నుంచి ప్రభుత్వ స్థలాలను స్వాధీనపరచుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్‌ను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు ధరణిలో పేర్లు మార్చి పలువురికి పట్టాదారు పుస్తకాలు అందించినట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు.